క్లుప్తంగా

శతాధిక వృద్ధుడు మృతి


భూమయ్య(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు బిల్ల భూమయ్య(102) మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం కుటుంబసభ్యులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య వజ్రవ్వ, ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. ఈయన కుటుంబంలో మొత్తం 25 మంది వరకు ఉన్నారు.

అయ్యప్ప మహాపడిపూజ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లపూర్‌లో బుధవారం అయ్యప్పపడిపూజ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామానికే చెందిన సుదన్–స్వప్న ఆధ్వర్యంలో, గురుస్వామి పాపారావు సమక్షంలో ప్రతిమకు పంచామృతాభిషేకాలు చేశారు. కన్నెస్వాములతో పేటతుల్లి కార్యక్రమాలు నిర్వహించారు. ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల స్వాములు హాజరయ్యారు.

మహిళా భవన్ ప్రారంభం


మహిళా భవన్ వద్ద సభ్యులు, నాయకులు

ముధోల్: మహిళ సంఘాల సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం మహిళా భవన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, ఐకేపీ ఏపీఎం అశోక్, ఎంపీటీసీలు సరళ, భూమేష్, అధ్యక్షురాలు ప్రేమల, జూనియర్ అసిస్టెంట్ అనూష, నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కడెం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాముగౌడ్, ఏఎన్ఎంలు లక్ష్మీ, నిహారిక, తదితరులు ఉన్నారు.

ప్రైవేటీకరణ విరమించుకోవాలి


ఖానాపూర్ నుంచి వెళ్తున్న ఉద్యోగులు

ఖానాపూర్: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ విధానాన్ని కేంద్రప్రభుత్వం విరమించుకోవాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, మనోజ్ డిమాండ్ చేశారు. బుధవారం వరంగల్‌లో జరిగిన 1104 ట్రేడ్ యూనియన్ ఉద్యోగుల సంఘ సమావేశానికి ఖానాపూర్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన విద్యుత్ అధికారులు, సిబ్బంది వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రెటరీ పోచయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

ఖానాపూర్: తల్లిదండ్రులు తమ పిల్లలకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలని హెల్త్‌ఎడ్యుకేటర్ జయలలిత అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యానగర్‌తోపాటు పలు వ్యాధినిరోధక టీకా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పార్వతి, ఆశవర్కర్లు ఉన్నారు.

కౌన్సిలర్లతో మంత్రి సమావేశం


మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. దీనికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై పట్టణ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈసందర్భంగా కౌన్సిలర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.

స్థలం కేటాయించాలి

పెంబి: మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్లకు స్థలం కేటాయించాలని ఎంపీడీవో సుధాకర్‌కు పెంబికే చెందిన పలువురు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం జరిగే వారసంత కు వచ్చే ప్రజలు.. మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్థలం కే టాయిస్తే పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించవచ్చని పేర్కొన్నారు. పెంబి ఉపసర్పంచ్ స్వప్నీల్‌రెడ్డి, మందపల్లి సర్పంచ్ సుధాకర్, గ్రామస్తులు శంకర్, స్వామి, మహేందర్, ఉపేందర్ ఉన్నారు.

సాగుకు బావులే ఆధారం

- బోర్ల జోలికెళ్లని రైతులు
- ఆదర్శంగా సరిహద్దు గ్రామాలు
- భూగర్భజలాలను కాపాడుకుంటున్న అన్నదాతలు


కోలూరుతండాలో సాగవుతున్న పసుపు పంట


మసల్గా శివారులో బావిలో నిండుగా నీరు

తానూరు: సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్రలో రైతులు అధికంగా బావుల నీటితోనే సేద్యం చేస్తూ లాభాలు పొందుతున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని తానూరు మండలంలోని సరిహద్దు గ్రామాల ప్రజలు సైతం భూగర్భజలాలను హరించే బోర్ల జోలికి వెళ్లకుండా కేవలం బావులపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. బావులు లేనివారు చెరువుల నుంచి పైపులైన్లు వేసుకొని ఆయిల్ ఇంజిన్ల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు.

పక్కరాష్ట్రంలో సాగు చూసి..

తానూరు మండలంలోని మొగ్లి, మసల్గా, కోలూరు తండా, కోలూరు, ఉమ్రి(కె), మహలింగి, ఝరి(బి), బోల్సా, హిప్నెల్లితండా గ్రామాలు సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్రను ఆనుకుని ఉంటాయి. ఇక్కడి ప్రజలకు మరాఠీ వాసులతోనే అనుబంధం ఎక్కువ. ఏటా వేసవిలో బోరుమోటార్లు అడుగంటుతుండటంతో మరాఠీ ప్రజలు కేవలం బావుల్లో ఉన్న నీటి ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో బోర్లు వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

బోర్ల వైపు చూడని సరిహద్దు గ్రామాలు..

సరిహద్దు గ్రామాల రైతులంతా బావులు, చెరువులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కరువులు వచ్చినా.. బావుల్లో నీరు తగ్గిపెరుగుతున్నా దూర ప్రాంతాల్లోని చెరువుల నుంచి పైపులు వేసుకుని నీటిని మళ్లించుకుంటున్నారు.. కానీ బోరుబావుల వైపు దృష్టి సారించడం లేదు. హిప్నెల్లితండాలో గ్రామస్తులు తాగుందుకు సైతం బావినీటినే వినియోగిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఇంట్లో ఉన్న బావినీటినే తాగుతున్నారు. కానీ బోరు వేయడం లేదు.

సాగుకు పుష్కలంగా నీరు..

వర్షాభావ పరిస్థితులు ఈ గ్రామాల్లో కనిపించవు.. ప్రతీ బావిలోనూ పుష్కలంగా నీరుంటుంది. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేకున్నా ఆయిల్ ఇంజిన్ సాయంతో పంటలను సాగు చేసుకుంటున్నారు. బావుల నీటితో అధిక విస్తీర్ణంతో పంటలు సాగవడంతోపాటు ఎక్కువ తడులు అందించవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

రెండు పంటలు పండిస్తాం



బోరుబావులు లేకపోవడమే మంచిది. ప్రస్తుతం బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. సరిపడ నీరు ఉండటంతో రెండు పంటలు పండిస్తాం. మాకూ ఆనందంగా ఉంది. సరిహద్దులో ఉన్న మహారాష్ట్రను చూసి మా గ్రామంలో బోర్లు వేయకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ముకోడ్ దర్శన్, మొగ్లి

సాగు విస్తీర్ణం పెరుగుతోంది



బోరునీటితో తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. కానీ బావుల ద్వారా పైపులొంచి నీరు రావడంతో తడులు పెరిగి అధిక విస్తీర్ణంలో పంటలు పండుతున్నాయి. మా తాతల కాలం నుంచి బావుల ద్వారానే పంటలు సాగు చేస్తున్నాం. దీంతో వచ్చే తరాలకు నీటి కొరత ఉండదు.

– జాదవ్ రాందస్, మసల్గాతండా

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా రోడ్డు



తానూరు: మండలంలోని దాగాం గ్రామం నుంచి హంగిర్గా వెళ్లే మార్గంలో బీటీరోడ్డు భారీ వర్షాలకు కోతకు గురైంది. దీంతో రాకపోకలు సాగించేటప్పుడు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీష్, పీఆర్ ఏఈ, ఫోన్: 94408 36125

ఈరోజు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

లోకేశ్వరం: మరమ్మతుల కారణంగా మండలంలోని పిప్రి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు

నిర్మల్‌రూరల్: తెలంగాణ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పాఠశాలల(టస్మా) జిల్లా స్థాయి ఆటల పోటీలు గురువారం నిర్వహిస్తామని అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రైతు బజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	40
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	25
ఆలుగడ్డ	30

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ధమాకా
నారాయణ : అవతార్
వెంకటేష్ : టాప్ గేర్

బాధిత కుటుంబాలకు అండ


సంగీత కుటుంబానికి సాయం ఇస్తున్న సభ్యులు


సాయినాథ్ భార్యకు పత్రాలు ఇస్తున్న మిత్రులు

కుంటాల : మండలంలోని లింబా(కే) గ్రామంలో ఒల్లెపు సంగీత ఇటీవల కవలలకు జన్మనిచ్చి మృతిచెందింది. కాగా బుధవారం గ్రామస్తులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో రూ.27వేల నగదు, క్వింటాలు బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జింకల సాయినాథ్ కుటుంబానికి కూడా రూ.70వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కుంటాల : కుంటాలకు చెందిన పంచాయతీ సిబ్బంది గోరేకర్ సాయినాథ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. 1993–94లో ఆయనతో కలిసి పదోతరగతి చదివిన మిత్రులు బుధవారం బాధిత కుటుంబానికి సాయం అందించారు. మిత్రులు పోగు చేసిన రూ.55వేలను సాయినాథ్ కూతురు లహరి పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు ఉన్నారు.

సరుకులు అందజేత

కడెం: మండలంలోని పెద్దూర్‌కు చెందిన బోర్లకుంట రాజన్న ఇటీవల మృతి చెందారు. కాగా బుధవారం బాధిత కుటుంబాన్ని రైతు నాయకుడు హపావత్ రాజేందర్‌నాయక్ పరామర్శించి 25 కిలోల బియ్యం, నూనె, పప్పులు, తదితర నిత్యావసర సరుకులు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ ముక్కెర గంగాధర్, రాజేందర్, స్వామి, లక్ష్మణ్, ఆనంద్ ఉన్నారు.

‘ప్రశ్నించినందుకే ప్రవీణ్‌కుమార్‌పై కక్ష’


అదనపుకలెక్టర్‌కు విన్నవిస్తున్న బీఎస్పీ నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాసమస్యలపై ప్రశ్నించినందుకే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ హేమంత్ బొర్కడేకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ ట్యాపింగ్‌కు యత్నిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. వినతిపత్రం అదించిన వారిలో మహిళా కన్వీనర్ లక్ష్మి, నియోజకవర్గ అధ్యక్షుడు రంజిత్, గణేష్ ఉన్నారు.

సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ ఏర్పాట్లు పరిశీలన


పాఠశాలలో పరిశీలిస్తున్న సభ్యులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఈనెల తొమ్మిది నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ కార్యక్రమాల ఏర్పాట్లను బుధవారం ఎస్‌సీఈఆర్టీ బృందం సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా డీఈవో రవీందర్ రెడ్డి, సూపరింటెండెంట్ భోజన్న బృంద సభ్యులకు నిర్వహణ ఏర్పాట్లను వివరించారు. ప్రదర్శనశాల గదులు, విద్యార్థుల వసతి గృహాలను సభ్యులు పరిశీలించారు. ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి పకడ్బందీగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్టేట్ సైన్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, సహాయాధికారి ఉమ ప్రదర్శనకు సంబంధించి సూచనలు చేశారు. జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

లోకేశ్వరం: విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా.. క్రమశిక్షణ అలవర్చుకోవాలని లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కన్కపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డయల్ 100పై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ అపరిచితుల నుంచి ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సర్పంచ్ నరేశ్, ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, ఏఎస్సై దిగంబర్, పోలీసులు హరీశ్, జితేందర్ ఉన్నారు.

కడెం: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై అయాజ్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలో యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లక్కీ డ్రాలు, ఓటీపీలతో మోసగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతారని.. వారి మాయలో పడొద్దని సూచించారు.

ఖాళీబిందెలతో నిరసన

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామపంచాయతీ శివారు కాలనీలో మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. పంచాయతీ అధికారులు బోరుకు విద్యుత్ కనెక్షన్ తీసేయడంతో రెండు రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఉదయం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సమస్య పరిష్కరించాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. పలువురు నాయకులు విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరిస్తామనడంతో ఆందోళన విరమించారు. దీనిపై ఇన్‌చార్జి పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్ మాట్లాడుతూ పంచాయతీపై అదనపు బిల్లుల భారం తగ్గించేందుకు ఎనిమిది బోర్లకు విద్యుత్ కనెక్షన్ తీసేశామన్నారు. సదరు కాలనీలో భగీరథ పైపులైన్ లేదని.. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద బుధవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. రూ.లక్ష విలువైన చెక్కును కుభీర్ మండలం నిగ్వాకు చెందిన బనెల్లి శంకర్‌కు.. అలాగే భైంసాకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, రోళ్ల రమేశ్, కృష్ణ, తోట రాము తదితరులున్నారు.

ఏరియాస్పత్రిలో అల్పాహారం ప్రారంభం

భైంసాటౌన్: భైంసా ఏరియాస్పత్రిలో బుధవారం రోగులకు అల్పాహారం పంపిణీ ప్రారంభించారు. డా కిరణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చేతుల మీదుగా అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, డాక్టర్ అనిల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి బియ్యం వితరణ

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి అయ్యప్ప మాలధారుడు తిలక్‌రావు క్వింటాల్ బియ్యం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

దొరికిన ఫోన్ అప్పగింత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కరిపె రాజశేఖర్ తనకు రోడ్డుపై దొరికిన రూ.15వేల విలువైన సెల్‌ఫోన్‌ను బుధవారం బాధితుడికి అందజేశారు. పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన మహమూద్ తన సెల్ పాగొట్టుకోగా పోలీసుల సమక్షంలో అందజేశాడు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

సర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఎస్సై పాకాల గీత ఆవిష్కరించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు టి.నవీన్‌కుమార్, నాయకులు జి.రాజేశ్వర్, చంద్రప్రకాష్, సుధీర్ పాల్గొన్నారు.

‘ఎనిమిది తడుల నీళ్లివ్వాలి’

కడెం: యాసంగి పంటలకు కడెం ప్రాజెక్ట్ నుంచి ఎనిమిది తడుల నీళ్లివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరి తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఐదు తడులు ఇస్తామని ఇరిగేషన్ అధికారులు తీర్మానించడం సరికాదని.. ఎనిమిది తడులు ఇస్తేనే పంటలు పూర్తయ్యే వరకు నీరు అందుతుందని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ నుంచి కడెం ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేసి పంటలకు అందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన దెబ్బడి హరీశ్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. బుధవారం బాధిత కుటుంబసభ్యులను తెలంగాణ జన సమితి ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ పరామర్శించారు. వారి వెంట గ్రామస్తులు బోజేందర్, శరత్, గంగాధర్, సాయినాథ్ ఉన్నారు.

జాతీయ అధ్యక్షుడి వర్చువల్ మీటింగ్ జయప్రదం చేయాలి

ఖానాపూర్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఈనెల 7న నిర్వహించతలపెట్టిన వర్చువల్ మీటింగ్ జయప్రదం చేయాలని అసెంబ్లీ పాలక్ శ్రీరామ్ చక్రవర్తి, అసెంబ్లీ ప్రభారి నీలం రాజు కోరారు. బుదవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో సీఎంరావ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులతో నిర్వహించతలపెట్టిన మీటింగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, జానుబాయి, హరినాయక్, రాజశేఖర్, టేకు ప్రకాశ్, సదాశివ్, నాయిని సంతోశ్, గిరి, ఉపేందర్, శ్రావణ్, మనోజ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అధికారులు గ్రామాల్లో పర్యటించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి

సారంగపూర్: అధికారులు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ.. ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా విద్యుత్, మిషన్‌భగీరథ, ఉపాధి పనుల విషయంలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. క్రీడాప్రాంగణాలు, మొక్కల సంరక్షణ, ప్రకృతివనాల నిర్వహణ, ఇతర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి, సూపరింటెండెంట్ శ్యాంసుందర్ రెడ్డి, పీఆర్ ఏఈ శరత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి’


మాట్లాడుతున్న పాలక్ వెంకటరమణారెడ్డి

సర్సాపూర్(జి): బూత్‌స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ పాలక్ కాట్‌పల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో బుధవారం బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులతో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పార్టీ విజయం సాధించేలా అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య, అసెంబ్లీ కన్వీనర్ మురళీధర్, మలికార్జున్‌రెడ్డి, సర్సా మహేష్, రవి, దేవేందర్, చరణ్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్లు

ముధోల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ఇళ్లు లేని నిరుపేదలకు స్వంత ఇళ్లు నిర్మించి ఇస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు భోస్లే మోహన్‌రావుపటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డబుల్‌బెడ్‌రూం దరఖాస్తుదారులు, సొంత ఇల్లు లేని నిరుపేదలతో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నియంతృత్వ పోకడలతో రాష్ట్ర ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. గతంలో ఇంటి స్థలం ఉన్నవారికి రూ. 5లక్షలు అందిస్తానని చెప్పి ఇప్పుడేమో రూ. 3లక్షలు ఇస్తామని కొత్త డ్రామా మొదలు పెట్టిండన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో డీపీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుభాష్‌జాదవ్ పటేల్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల పర్యటన

కుంటాల : మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. పంటలు పండించే విధానం, నేలల రకాలు, ఎరువులపై హెచ్ఎం ఎల్లన్న అవగాహన కల్పించారు. పరిసరాల విజ్ఞానంలో భాగంగా విద్యార్థుల్ని పర్యటనకు తీసుకెళ్లినట్లు హెచ్ఎం పేర్కొన్నారు.